క్లుప్తంగా

బీహెచ్‌ఈఎల్ యాజమాన్యానికి సమ్మె నోటీసు

గాజువాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలకు నిరసనగా వచ్చేనెల 9న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమ్మెకు మద్దతుగా బీహెచ్‌ఈఎల్ కార్మిక సంఘాలు ఆ సంస్థ యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేశాయి. లేబర్ కోడ్స్ రద్దు, పీఎఫ్ డేట్ ఆఫ్ జాయినింగ్, హయ్యర్ పెన్షన్, కాంట్రాక్టు కార్మికులకు రూ.26వేల కనీస వేతనం తదితర డిమాండ్లపై బీహెచ్‌ఈఎల్ కార్మిక సంఘాల నాయకులు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు జి.టి.పి.ప్రకాష్, పి.శివరాం, బి.కృష్ణమూర్తి, సీతమ్మనాయుడు, వారాడ ఆనందరావు, మురళీశ్వరరావు, పి.వి.ఎన్.రాజు, ఎస్.సాహు, బి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీ ఎస్సీ బిల్డింగ్స్‌లో నెల రోజుల నుండి తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సమస్యను 40వ వార్డు బీజేపీ అధ్యక్షురాలు మేఘనదుర్గ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె నీటి సరఫరా విభాగం అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన అధికారులు ఆదివారం పైపులైన్లను సరిచేసి నీటి సరఫరాను అందించారు.

రోడ్డుపైనే స్కూల్ బస్సులు!



రోడ్డుపై పార్కింగ్ చేసిన బస్సు

విశాఖ విద్య: ప్రైవేటు స్కూల్ బస్సులను రహదారులపైనే పార్కింగ్ చేస్తున్నారు. కాలనీల వాసులు రాకపోకలు సాగించే రోడ్లపై బస్సులను రోజంతా నిలుపుతున్నారు. దీని వల్ల ఆ దారుల్లో భారీ వాహనాలు వస్తే ముందుకు వెళ్లలేని పరిస్థితులు ఎదురవుతున్నాయని కాలనీ వాసులు అంటున్నారు. ప్రైవేటు స్కూళ్ల బస్సులను నిలిపేందుకు తగిన పార్కింగ్ ప్రదేశం ఉండాలనేది నిబంధన ఉంది. పాఠశాల నిర్వహణకు అనుమతులు ఇచ్చే సమయంలో తప్పనిసరిగా పార్కింగ్ ప్రదేశం ఎక్కడ చూపించారనేది ధ్రువీకరణ పత్రాలను అందజేయాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించిన మీదటనే గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. కానీ ఎన్ఏడీ ఏరియాలోని పలు ప్రైవేటు పాఠశాలలకు ఎటువంటి పార్కింగ్ ప్రదేశం లేకున్నా ఎలా అనుమతులు ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వీధికుక్కల స్వైర విహారం



మల్కాపురం సేవా మార్గంలో సంచరిస్తున్న వీధి కుక్కలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రాంతంలో వీధి కుక్కల బెడద ఎక్కువ అయింది. దీంతో సేవా మార్గంపై రాకపోకలు సాగించే పాదచారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మల్కాపురం మార్కెట్ రోడ్డు, కృష్ణ బార్ అండ్ రెస్టారెంట్ వెనుక మార్గంలో గుంపులుగా సంచరిస్తున్నాయి. ఒంటరిగా రాకపోకలు సాగించే వారిపై దాడి చేస్తున్నాయి. అధికారులు స్పందించి వీధికుక్కలను ఏరివేయాలని పలువురు కోరుతున్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా అప్పలరాజు



నియామక పత్రం అందుకుంటున్న డాక్టర్ అప్పలరాజు

విశాఖ విద్య: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ నమ్మి అప్పలరాజు యాదవ్ నియమితులయ్యారు. ఎన్ఏడీ కొత్త రోడ్‌లోని ఆసంఘ కార్యాలయంలో ఆదివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంగళరావు యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ నమ్మి అప్పలరాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి వేమల ప్రసాద్‌కు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కార్యాలయాన్ని అప్పలరాజుతో కలిసి వెంగళరావు ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్, రాష్ట్ర కన్వీనర్ ఆవుల నరసింహారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణమోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లాడి అప్పలరాజు, చంద్రమౌళి, 13 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కాలువలు, గెడ్డలు

- ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోని వైనం
- సిల్ట్ తొలగింపులో అవినీతి
- ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం
- ప్రజలకు తప్పని అవస్థలు



దుర్గానగర్‌లో గెడ్డ రక్షణగోడ దుస్థితి



గవర కంచరపాలెం గెడ్డలో పూడికతీత పనులు ఇలా...



గొల్లకంచరపాలెంలో శిథిలావస్థలో కాలువ



తోటవీధిలో ప్రధాన గెడ్డకు అడ్డంగా మంచినీటి పైపులు ఇలా



ఆక్రమణకు గురైన అశోక్‌నగర్ గెడ్డ

కంచరపాలెం : పారిశుధ్య నిర్వహణపై పదే పదే హెచ్చరిస్తున్నప్పటికీ, విశాఖలోని కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి మారడం లేదు. ముఖ్యంగా కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం పరిధిలోని సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, గొల్లకంచరపాలెం, దుర్గానగర్, తోటవీధి, గవర కంచరపాలెం, రామ్మూర్తి పంతులుపేట ప్రాంతాల్లో మురుగు కాలువలు, గెడ్డలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

గెడ్డల్లో నిర్మాణ వ్యర్థాలు వేయడం వల్ల అవి ఆక్రమణలకు గురై పూడికలతో నిండిపోతున్నాయి. దీనివల్ల దోమలు విజృంభించి, తరచూ వ్యాధుల బారిన పడుతున్నామని ఆయా వార్డుల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ సుభాష్‌నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు దుర్గంధభరిత వాతావరణంలో చదువుకోవాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గెడ్డలు ఆక్రమణకు గురికావడం వల్ల పారిశుధ్య నిర్వహణకు ఇబ్బందికరంగా మారుతోందని పబ్లిక్ హెల్త్ సిబ్బంది చెబుతున్నారు. గెడ్డల పునర్‌నిర్మాణానికి జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించి నిర్మాణ పనులు చేపట్టాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.

సిల్ట్ తొలగింపులో అవకతవకలు

జోన్–5 పరిధిలో గెడ్డల్లో సిల్ట్–పూడికలు తొలగింపు పనులు ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరగాలి. ఈ ప్రక్రియ ప్రతి ఏటా ఏప్రిల్–మే నెలల్లో, అంటే వేసవిలో పూర్తిచేయాలి. ఈ పనులకు కాంట్రాక్టర్లకు టెండర్లు పిలిచి లక్షల రూపాయలు ఖర్చు చేస్తారు. అయితే దీనికి విరుద్ధంగా, కాంట్రాక్టర్లు వేసవిలో పనులు వదిలేసి, వర్షాలు కురిసే సమయం వరకు వేచి ఉండి పనులు ప్రారంభిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వార్డు కార్పొరేటర్లు కేవలం కొబ్బరికాయలు కొట్టి భూమిపూజలు చేసి ప్రారంభోత్సవాలు చేస్తున్నారని, అంతకుముందే ఆయా వార్డుల్లో శానిటరీ సిబ్బందితో గెడ్డలు, కాలువల్లో పూడికతీత పనులు చేయిస్తున్నారని, ఈ ఖర్చులను ఇంజినీరింగ్ అధికారులు తమ ఖాతాల్లో జమ చేసుకుంటున్నారని ఆరోపణలున్నాయి. ఇంజినీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఎవరి వాటా వారికి అందిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

వార్డుల విస్తీర్ణం, పారిశుధ్య సమస్యలు

గతంలో 36–43వ వార్డులను 56వ వార్డుగాను, 40, 41, 42వ వార్డులను 57వ వార్డుగా మార్చడంతో వార్డుల విస్తీర్ణం బాగా పెరిగింది. అయితే ఆయా వార్డుల్లో గెడ్డలు మాత్రం పూర్తిగా కుదించుకుపో తున్నాయి. కాలువలు, గెడ్డలు శిథిలావస్థలో ఉండడంతో పారిశుధ్య సిబ్బంది నామమాత్రంగా పనులు చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శిథిలం, ఆక్రమణలకు గురైన గెడ్డలు ఇవి..

- కంచరపాలెం అశోక్‌నగర్ నుంచి జాషువానగర్‌కు ప్రవహించే గెడ్డలు పూర్తిగా కుదించుకుపోయాయి. గెడ్డలకు ఇరువైపులా నివాసాలు ఉండే ప్రజలు వాటిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు.
- కంచరపాలెం బీఆర్‌టీఎస్ నేతాజీ గ్రంథాలయ రహదారి గెడ్డ నుంచి దయానందనగర్ చాకలిగెడ్డకు వెళ్లే గెడ్డలు కుదించుకుపోయాయి. రైల్వే ట్రాక్‌కు వెళ్లే గెడ్డలు శిథిలావస్థకు చేరుకున్నాయి.
- గొల్లకంచరపాలెం నుంచి తోటవీధి, దుర్గానగర్‌కు వెళ్లే కాలువల గోడలు శిథిలావస్థకు రావడంతో మురుగు గోడల్లోకి ఇంకిపోయి, చెత్తాచెదారంతో పాటు పూడికలతో నిండిపోయి దుర్గంధభరితంగా మారాయి.
- గెడ్డలు శిథిలావస్థకు రావడంతో మురుగు ప్రవాహానికి అడ్డంగా మారుతుండడంతో పారిశుధ్య సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- నిత్యం పర్యవేక్షించాల్సిన సచివాలయ శానిటేషన్ సిబ్బందికి చెత్త సమస్యలు, అధికారుల నుంచి ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని వాపోతున్నారు.
- దుర్గానగర్ నుంచి గౌరీనగర్‌కు వెళ్లే గెడ్డలకు ఆనుకుని ఉన్న రైల్వే రక్షణగోడ కూలి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పట్టించుకునే నాథుడు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- ఊర్వశి కూడలి సుభాష్‌నగర్ నుంచి ఐటీఐ జంక్షన్ భవాని గార్డెన్‌కు వెళ్లే గెడ్డల్లో, సుభాష్‌నగర్ పాఠశాలకు ఆనుకుని ఉన్న గెడ్డను ఆక్రమించే ఉద్దేశ్యంతో డెబ్రీస్‌లు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

శిథిలావస్థలో కాలువలు

వార్డులో గెడ్డలు, కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గెడ్డలు, కాలువలకు మరమ్మతులు చేపట్టాలని జోనల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదు. మురుగు సక్రమంగా పారకపోవడంతో దుర్గంధభరితంగా ఉంటుంది. దోమలు వృద్ధి ఎక్కువగా ఉండడంతో రోగాల బారిన పడుతున్నాం.

– గురుమూర్తి, రామ్మూర్తిపంతులుపేట, కంచరపాలెం

పూడికతీతపై దృష్టి పెట్టండి

ప్రతి ఏడాది శానిటరీ సిబ్బంది గెడ్డల్లో పూడికలు తీస్తారు. ఇంజినీరింగ్ అధికారులు అదే సమయంలో పర్యవేక్షిస్తారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో కిందస్థాయి సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. పూడికతీతలు చేపట్టిన తరువాత తరలింపు సమయంలో శానిటరీ, ఇంజినీరింగ్ సిబ్బంది మధ్య సమన్వయలోపంతో వార్డులు దుర్గంధభరితంగా మారుతున్నాయి.

– ఎస్.జాన్సన్, చాకలిగెడ్డ, దయానందనగర్, కంచరపాలెం.

ఆక్రమణల నుంచి గెడ్డలు కాపాడాలి

మా వార్డులో చాలా వరకు గెడ్డలు ఆక్రమణకు గురవుతున్నాయి. స్థానికులు గెడ్డకు ప్రధాన ద్వారాల వద్ద వ్యర్థాలు వేసి మురుగు ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నారు. ముందుగా ఇంటి నిర్మాణ వ్యర్థాలు వేసి ఆక్రమణలు చేస్తున్నారు. పబ్లిక్‌హెల్త్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ లోపంతో గెడ్డలు ఆక్రమణకు గురవుతున్నాయి. సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకుని వెళ్తాం.

– రంజిత్‌బాబు, శ్యామ్‌నగర్, 104ఏరియా

పోరాటాల ద్వారా ప్రజలకు దగ్గరవుదాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్

- యువత పోరును విజయవంతం చేయండి
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్

గోపాలపట్నం: పోరాటాల ద్వారా ప్రజలకు దగ్గరవుదామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త మళ్ల విజయప్రసాద్ అన్నారు. సీతమ్మధారలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు సోమవారం తలపెట్టిన యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలు మంచి చేశారని.. నేడు చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి రూ.3000 ఇస్తామని, ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత గాలికి వదిలేశారని విమర్శించారు. దీనిపై యువత నిరసన తెలిపేందుకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఉదయం 9గంటలకు యువజన విభాగం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా యువత పోరు పోస్టర్‌తో పాటు బాబు అంటే మోసం జగన్ అంటే నమ్మకం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్లు పీవీ సురేష్, గల్లా శ్రీను, పిల్లా కన్నబాబు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు బాజీ నాయుడు, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు సర్వసిద్ధి సాయిలత, వార్డు అధ్యక్షులు జి. కృష్ణ, ప్రసాదరెడ్డి, గణేష్, ఆర్. సత్యనారాయణ, రాజు, అనుబంధ సంఘాల నాయులు కిరణ్, పి జ్యోత్స్న, శ్రీదేవి వర్మ, శ్యామ్యూల్, వెంకటేశ్వరరావు, ధనరాజ్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై దాడులు

- 25 మద్యం బాటిళ్లు స్వాధీనం
- ముగ్గురు అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు చూపుతున్న పోలీస్ సిబ్బంది

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో బెల్ట్ దుకాణాలపై దాడులు కొనసాగుతున్నాయి. సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేస్తున్నారు. మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో రహస్యంగా ఇళ్లు, పాన్‌షాపుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం సేకరించిన సీఐ గొలగాని అప్పారావు సిబ్బందిని మూడు బృందాలుగా నియమించారు. దీనిలో భాగంగా ఆదివారం దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేసి 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మల్కాపురం స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా.. మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించినా 0891–2577392 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ గొలగాని అప్పారావు కోరారు.

స్టాపర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

కొమ్మాది : బీచ్‌రోడ్డులోని రామానాయుడు స్టూడియో సమీపంలో స్టాపర్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కంచరపాలెం అరుంధతినగర్‌కు చెందిన జి.ఈశ్వరరావు (34) ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం ఉద్యోగరీత్యా ఈశ్వరరావు భీమిలి వెళ్లాడు. తిరిగి వస్తుండగా యోగాంధ్ర కోసం రామానాయుడు స్టూడియో సమీపంలో ఏర్పాటు చేసిన స్టాపర్‌ను బలంగా ఢీకొట్టాడు. తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

నిలువ నీడ లేక..

- ముఖ్య కూడళ్లలో కానరాని బస్ షెల్టర్లు
- ఎండ, వానకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



జింక్ ఆంజనేయస్వామి బస్టాప్ వద్ద కానరాని షెల్టర్



ఆర్‌కేపురం బస్టాప్ వద్ద చెట్టునీడే షెల్టర్

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని మల్కాపురం, శ్రీహరిపురం, ఆర్‌కేపురం, గాజువాక ఆర్టీసీ డిపో, జింక్ ఆంజనేయస్వామి ఆలయం వంటి ప్రధాన కూడళ్లలో బస్ షెల్టర్లు లేకపోవడం వల్ల నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం ఎదురుచూస్తున్న వారికి ఎండ వేడిమికి చుక్కలు కనబడుతున్నాయి. వందల సంఖ్యలో ప్రయాణికులు ఈ ప్రాంతాల నుండి నిత్యం వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులపై ప్రయాణిస్తుంటారు. అయితే, బస్సులు సమయానికి రాకపోవడం, పైగా ప్రయాణికులు వేచి ఉండేందుకు కనీస నీడ లేదా బస్ షెల్టర్లు లేకపోవడం పరిస్థితిని మరింత దారుణంగా మారుస్తోంది. తీవ్రమైన ఎండలకు ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు, కొందరు సొమ్మసిల్లుతున్నారు. ఎక్కువసేపు ఎండలో ఉండలేక, ప్రయాణికులు బస్ స్టాప్‌కు దూరంగా ఉన్న చెట్ల నీడను గానీ, దగ్గర్లోని వాణిజ్య సముదాయాల నీడను గానీ ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సమస్యల కారణంగా, చాలామంది ప్రయాణికులు బస్సులను వదిలి ఆటోలు లేదా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన అవసరం వస్తోంది.

బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి

గాజువాక ఆర్టీసీ డిపో యాజమాన్యానికి ప్రధాన కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలతో కూడిన షెల్టర్లను ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులు వినతులు అందజేస్తున్నప్పటికీ.. ఇప్పటివరకు ఈ సమస్యకు పరిష్కారం లభించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



ఆర్‌కేపురం బస్టాప్‌లో బస్ షెల్టర్ లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.ఎండలో నిలబడలేక చెట్ల నీడను ఆశ్రయించాల్సి పరిస్థితి. ఆర్‌కేపురం సమస్య మాత్రమే కాదు, పారిశ్రామిక ప్రాంతంలోని మల్కాపురం, శ్రీహరిపురం, గాజువాక ఆర్టీసీ డిపో, జింక్ ఆంజనేయస్వామి ఆలయం వంటి అనేక ప్రధాన కూడళ్లలో ఇదే పరిస్థితి ఉంది. ప్రయాణికులు పడుతున్న ఈ అవస్థలను తగ్గించడానికి తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలి. తగినన్ని బస్ షెల్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు, బస్సులు సమయానికి వచ్చేలా చూడటం కూడా చాలా అవసరం.

– ఆదారి హరీష్, ప్రయాణికుడు

వృద్ధులు సొమ్మసిల్లి పడిపోతున్నారు



మల్కాపురం బస్టాప్‌లో బస్ షెల్టర్ లేకపోవడం వల్ల 58 ఏళ్ల వృద్ధుడు సొమ్మసిల్లి పడిపోయాడు. సరైన నీడ ఉండి ఉంటే ఆ వృద్ధుడికి ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలంటే మల్కాపురం బస్టాప్ వద్ద తక్షణమే బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయడం అత్యవసరం. ప్రయాణికులు, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పిల్లలు ఎండకు గురికాకుండా షెల్టర్లు ఏర్పాటు చేయాలి.

– బాలు, ప్రయాణికుడు

మహిళల చెస్ టైటిల్ హేమిషా కైవసం

విశాఖ స్పోర్ట్స్: జిల్లా మహిళల చదరంగం చాంపియన్‌షిప్‌ను ఎస్.హేమిషా కైవసం చేసుకుంది. జి.కుమారి రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం శ్రీ కశ్యప్ జూనియర్ కళాశాలలో ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. మొత్తం 63 మంది మహిళా చదరంగ క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ఆరుగురు ఫిడే ర్యాంకింగ్ సాధించిన వారు ఉండటం విశేషం. టోర్నీలో రెండో ర్యాంక్‌తో (1656 ఫిడే రేటింగ్) బరిలోకి దిగిన జి.కుమారి, చివరిదైన ఆరో రౌండ్‌లో మూడో ర్యాంక్‌తో ఆడిన ఎస్.హేమిషా (1490 రేటింగ్)తో డ్రాగా ముగించింది. పాయింట్లలో సమానంగా నిలిచినప్పటికీ, టైబ్రేకర్స్‌లో కుమారి వెనుకబడటంతో హేమిషా విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో టి.బంధవిక, డి.దివ్య (1463), హెచ్ఎస్ బుష్రా ఐదు పాయింట్లు సాధించినప్పటికీ, టైబ్రేకర్లలో వెనుకబడి జిల్లా జట్టుకు ఎంపిక కాలేకపోయారు. ఎరీనా కాండిడేట్ మాస్టర్ ఎం.మనస్వి(1489)తో పాటు ప్రవల్లిక, ఆశ్రిత, లలిత్యా నాలుగున్నరేసి పాయింట్లతో టోర్నీని ముగించారు. ఆసక్తికరంగా ఫిడే రేటర్ మనస్వికి జిల్లా జట్టులో స్థానం దక్కలేదు. మరోవైపు ఆరీనా ఫిడే మాస్టర్ ఎస్.గౌర్లి పోటీలకు హాజరు కాకపోవడం గమనార్హం. ఈ చాంపియన్‌షిప్‌లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి ఎన్టీఆర్ జిల్లాలో జరగనున్న ఏపీ అంతర్ జిల్లాల మహిళల చాంపియన్‌షిప్‌కు అర్హత లభించింది.